
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 16 ఫిబ్రవరి 2025

నేడు డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



మధిరటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు ముదిగొండ మండలానికి చేరుకుని లక్ష్మీపురం, బాణాపురం, గంధసిరి గ్రామాల్లో పలు ప్రవేటు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు మధిర పట్టణంలో కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొని అనంతరం పలు ప్రవేట్ కార్యక్రమాలకు హాజరవుతారు. రాత్రికి ఖమ్మంలో బసచేసి సోమవారం ఉదయం హైదరాబాద్‌కు వెళతారు.




మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

6

బంజారాలకు ఆరాధ్య దైవం
సంత్‌సేవాలాల్

- జగదాంబదేవి ఆశీస్సులతో గిరిజనుల దైవంగా మారారు
- జయంతి వేడుకల్లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

వేసవి ప్రారంభంలో తాగునీటి కొరతకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో పాటు రైతులు యాసంగి పంటలకు నీటిని వినియోగిస్తుండడం, ప్రజలు నీటి పొదుపు పాటించకపోవడంతో ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. నెలరోజుల్లోనే రెండు అడుగుల మేర నీటిమట్టం పడిపోయింది. గత వానాకాలం సీజన్‌లో విస్తారంగా వర్షాలు కురిసి వాగులు వంకలు పొంగి చెరువులు, రిజర్వాయర్లు నిండి భూగర్భజలాలు పెరిగినా వేసవి వచ్చేసరికి అదేస్థాయిలో నీటిమట్టం తగ్గిపోతోంది. భూగర్భంలో ఉన్న జలాలను పైకి తీసుకొచ్చేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించడంలేదు.



ఏన్కూరు మండలం లింగన్నపేటలో అడుగంటిన చెరువు

పాతాళానికి
వే'గంగా'..

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 15: చెరువులు ఎండిపోతున్నాయి. ఎన్నెస్పీ కాలువల ద్వారా సరఫరా అవుతున్న నీరు రబీ అవసరానికే సరిపోతోంది. బావులు అడుగంటుతున్నాయి. బోర్లు కూడా క్రమంగా ఎండిపోతున్నాయి. పొలాలు నీటి చుక్క కోసం అర్రులు చాస్తున్నాయి. ఫిబ్రవరిలోనే ప్రజలు తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గత డిసెంబర్ నాటికి ఖమ్మం జిల్లాలో 3.87మీటర్ల లోతున భూగర్భజలాలు ఉండగా జనవరి నాటికి 4.49మీటర్ల లోతుకు పడిపోయాయి. అంటే 0.62 మీటర్లకు భూగర్భజలాలు పడిపోయాయి.

- జిల్లాలో అడుగంటుతున్న భూగర్భజలాలు
- నెలరోజుల్లోనే రెండు అడుగులు పడిపోయిన నీటిమట్టం
- కొన్ని మండలాల్లో మరింత వేగంగా తగ్గుదల
- ఎండుతున్న చెరువులు, బావులు

పడిపోతున్న నీటిమట్టం

ఖమ్మం జిల్లాలో అధికారులు సేకరించిన గణాంకాల ప్రకారం జనవరి చివరి నాటికి భూగర్భజలమట్టం వేగంగా తగ్గిపోతోంది. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో రోజురోజుకీ భూగర్భజ మట్టం తగ్గిపోతోంది. ముఖ్యంగా వేంసూరు, సత్తుపల్లి, రఘునాథపాలెం, మధిర, కామేపల్లి, ఏన్కూరు, ఖమ్మం రూరల్ మండలాల్లో భూగర్భజలాల వేగంగా అడుగంటిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. 18 మండలాల్లో గత డిసెంబరు 23నుంచి, జనవరి నెలాఖరుకు గణనీయంగా భూగర్భజలాలు అడుగంటిపోయాయి. డిసెంబరులో వేంసూరు మండలంలో 3.67 మీటర్లు ఉండగా 5.55 మీటర్లకు పడిపోయింది. సత్తుపల్లి మండలంలో 12.6మీటర్లు ఉండగా 13.75కి, రఘునాథపాలెంలో 3.47 ఉండగా 4.61కి పడిపోయింది. మధిరలో 4.42మీటర్లనుచి 5.97కి, ఏన్కూరు మండలంలో 5.8 కిగాను 6.95మీటర్లకు పడిపోయింది. పెనుబల్లి మండలంలో 3.36కి గాను 4.14కి, ఎర్రుపాలెంలో 5.61నుంచి 6.5, కామేపల్లి మండలంలో 6.83నుంచి 8.59మీ, సింగరేణిలో 3.88మీటర్లకు గాను 4.66, ఖమ్మం అర్బన్ మండలంలో ఈ డిసెంబర్ నాటికి 1.43 మీటర్లు ఉండగా జనవరి 25 నాటికి 1.77 మీటర్లకు పడిపోయింది. ఖమ్మంరూరల్ మండలంలో 2.32మీటర్లకు గాను 3.02కి పడిపోయింది. కొణిజర్ల, ముదిగొండ మండలాల్లో మాత్రం భూగర్భజలాలు తగ్గకపోవడం గమనార్హం.. కల్లూరు మండలంలో అత్యల్పంగా 0.05 మీటర్లకు భూగర్భజలాలు పడిపోయాయి. అయితే కొన్ని మండలాల్లో ఫిబ్రవరి లోనే ఈ పరిస్థితి ఉంటే భవిష్యత్తులో పరిస్థితి ఏంటనే విషయమై ఆయా మండలాలు ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నీటి వృథాను అరికట్టాలి

ఎం. బాలు,
భూగర్భజలశాఖ జిల్లా అధికారి, ఖమ్మం



ప్రజలు, రైతులు ఖచ్చితంగా నీటి పొదుపును పాటించాలి. పంటపొలాలకు శాస్త్రవేత్తలు, నిపుణులు సూచించిన విధంగానే నీటిని వినియోగించాలి. ఆటోమేటిక్ స్టార్టర్ల ద్వారా నీటిని విచ్చలవిడిగా తోడి వృథా చేయవద్దు. పంచాయతీ అధికారులు, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ఉండి ఎక్కడా పైపులు లీకులు లేకుండా నీరు వృథాకాకుండా చూడాల్సిన అవసరం ఉంది.

పట్టణాల్లో దాహార్తి ..

- రెండు, మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా
- జల వనరులున్నా సరఫరా వ్యవస్థలో లోపాలు
- భద్రాద్రి జిల్లాలో క్రమంగా పెరుగుతున్న నీటి ఎద్దడి

వివరాలు : 6లో



ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

- తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో రిజర్వేషన్ల పెంపునకు పోరాటం
- తెలంగాణ జాగృతి తరుపున సంఘటిత ఉద్యమం
- బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

6

డీసీసీబీ, పీఏసీఎస్‌ల పాలకవర్గాల పదవీకాలం పొడిగింపు

- 6 నెలలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ
- సీఎంకు పాలకవర్గాల కృతజ్ఞతలు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీసీసీబీ, పీఏసీఎస్ నూతన పాలకవర్గాల ఏర్పాటు విషయమై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. డీసీసీ బ్యాంకులు, పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువును 6నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నుంచి టెస్కాబ్ చైర్మన్ మార్నెనీ రవీందర్‌రావు ప్రభుత్వ ఉత్తర్వులను అందుకున్నారు. దీంతో పాలకవర్గ సభ్యుల్లో ఆనందం నెలకొంది. డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు పదవీకాలానికి 6 నెలల పొడిగింపు లభించింది. పాలకవర్గాల పదవీకాలం పెంచడంతో ఆయా పాలకవర్గ సభ్యుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. గడువు పెంచినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పరిషత్ ఓటర్లు 8,22,528

- జాబితా విడుదల చేసిన జిల్లా అధికారులు
- ప్రాదేశిక ఎన్నికలకు ముమ్మర కసరత్తు

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా, మండల పరిషత్ అధికారులు ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల తుది జాబితాను శనివారం విడుదల చేశారు. గత సోమవారం జిల్లాలోని ఎంపీటీసీల వారీగా ఆయా గ్రామాలు, మండల, జిల్లా పరిషత్తులలో ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. మెత్తం 8,22,528 మంది ఓటర్లుగా లెక్కతేల్చారు. వీరిలో 3,97,766 పురుషులు, 4,24,739 మంది మహిళా ఓటర్లు, థర్డ్‌జెండర్లు 23 మంది ఉన్నట్లు తేల్చారు. 1,607 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తూ ముసాయిదా జాబితాను వెల్లడించారు. 12, 13వ తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించి అవసరమైన మార్పులు, చేర్పులకు అవకాశాన్ని కల్పించారు. 13న పరిషత్ ఎన్నికలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలను ఎంపీడీవోలు ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకున్నారు. వాటి ఆధారంగా 15న శనివారం తుది జాబితాను ప్రకటించారు. ఈ జాబితాల ప్రకారం జిల్లాలోని 20 జడ్పీటీసీలు, 287 ఎంపీటీసీలలకు 1,607 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 8లక్షల 22,528 ఓటర్లు ఉండగా వీరిలో 3లక్షల 97,767 మంది పురుషులు, 4లక్షల 24,738 మంది మహిళలు, 23 మంది థర్డ్ జెండర్లు ఉన్నట్లు లెక్కతేల్చారు.



ముస్తాబైన లింగమంతుని ఆలయం

నేటి నుంచి లింగమంతుల జాతర

» రేగులగండికి తరలునున్న భక్తులు

అశ్వాపురం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): యాదవులు ఆరాధ్యదైవంగా భావించే భవానీ లింగమంతుని జాతర ఆదివారం నుంచి మణుగూరు-అశ్వాపురం మండలాల సరిహద్దులో ఉన్న రేగులగండి గుట్టపై వైభవంగా ప్రారంభం కానుంది. జాతరకు అశ్వాపురం-మణుగూరు యాదవ సంఘాల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రతి రెండేళ్ల కొకసారి ఈజాతరను పౌర్ణమి రోజున నిర్వహిస్తారు.

1982లో రేగులగండి చెరువు పక్కన గుట్టపై లింగమంతుని స్వామి వెలిసినట్లు యాదవ పెద్దలు పేర్కొంటారు. అప్పటి నుంచి ఇక్కడ గుడి నిర్మించి జాతర నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయం వద్ద బోనాల ఉత్సవంతో జాతర ప్రారంభమవుతుంది. అనంతరం భవాని, లింగమంతుని కల్యాణం భక్తుల జయద్వానాలు, మంగళవాయిద్యాల నడుమ జరిపిస్తారు. మంగళవారం వరద పాశంతో ముగుస్తుంది. కాగా శనివారం సాయంత్రం నుంచే అశ్వాపురం, పినపాక, మణుగూరు మండలాల నుంచి భక్తులు ఎడ్ల బండ్లపై (భవానీ రథాలు) రేగులగండి చేరుకుని అక్కడ బస చేస్తారు. జాతరను తిలకించటానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లానుంచి కూడా భక్తులు తరలి రానున్నారు. జాతర సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, మణుగూరు సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో వసతి, తాగునీటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

అమ్మవార్ల వన ప్రవేశం..



అమ్మవార్ల ప్రతిమలను అందజేస్తున్న లింగయ్య దొర

కరకగూడెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరుమళ్ల జాతర మహోత్సవం ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగగా అమ్మవార్లు శనివారం వనప్రవేశం చేయడంతో పూర్తయింది. ఈ సందర్భంగా జాతరను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వన దేవతల వనప్రవేశం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన చందా లింగయ్య దొర ఆలయ కమిటీ సభ్యులకు, ఆదివాసీ రాష్ట్ర నాయకులకు సమ్మక్క, సారలమ్మ ప్రతిమలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర మహోత్సవానికి సహకరించిన ఐటీడీఏ పీవో రాహుల్, తహసీల్దార్ నాగ ప్రసాద్, ఎంపీడీవో కుమార్, కరకగూడెం ఎస్ఐ, పంచాయితీ కార్యదర్శులకు, సిబ్బందికి అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించిన పూజారులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి వన దేవతలను వన ప్రవేశం చేపించారు. ఈ కార్యక్రమంలో చందా సంతోష్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు చుంచు రామక్రిష్ణ, చందా భిక్షపతి, వీరయ్య, భూపతయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా సాగునీరు



సాగర్ ఎడమకాల్వపై 72కి.మీ. రెగ్యులేటర్ వద్ద అరకొరగా సరఫరా అవుతున్న సాగర్‌నీరు

» కల్లూరు సర్కిల్‌లో మేజర్ కాల్వలకు సక్రమంగా అందని తీరు
» సరఫరాలో అధికారుల మధ్య సమన్వయ లోపం
» పొట్ట దశలో ఉన్న వరిపైరు
» సక్రమంగా అమలు జరగని వారబందీ

కల్లూరు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): కల్లూరు సర్కిల్ ప్రాంతానికి సాగర్ ఎడమకాల్వ ద్వారా అరకొరగా సాగర్ నీరు సరఫరా అవుతున్నాయి. ఈ ప్రాంతానికి డిమాండ్‌కు తగినట్లుగా సాగునీరు సరఫరా కాని పరిస్థితి నెల కొంది. దీంతో కల్లూరు డివిజన్ పరిధిలో గల మధిర బ్రాంచి కాల్వపై గల 0నుంచి 22 కి.మీ. వరకు పొడవున గల పలు మేజర్ కాల్వలకు సాగునీరు అందక చిరు పొట్టదశలో ఉన్న వరి పైరుకు సాగునీటి ఎద్దడి ఏర్పడుతుంది. దీంతో మధిర బ్రాంచి కాల్వపై గల మేజర్ కాల్వల పరిధిలో గల సాగర్ ఆయుకట్టు రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు.

వాస్తవంగా కల్లూరు జలవనరులశాఖ సర్కిల్‌కు గాను 3,200 క్యూసెక్కుల నీరు అందాల్సి ఉండగా కేవలం 2,400 క్యూసెక్కుల నీరు మాత్రమే సరఫరా అవుతోంది. కల్లూరు మండలంలో సాగర్ కాల్వ కింది యాసంగిలో 30 వేల ఎకరాల్లో వరిపైరు సాగు చేశారు. ఇక మధిర బ్రాంచి కాల్వకు గాను 1500 క్యూసెక్కులపైగా సాగునీరు సరఫరా కావాల్సి ఉండగా కేవలం 700 నుంచి 800 క్యూసెక్కుల వరకు నీరు సరఫరా అవుతోంది. ఈ పరిస్థితిలో మధిర బ్రాంచి కాల్వ పరిధిలో గల లింగాల, పుణ్యపురం, చెన్నూరు, పెద్దకోరుకొండి, చిన్నకోరుకొండి, ఉటుకూరు తదితర మేజర్ కాల్వలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందక చివరి ప్రాంతానికి చెందిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయలోపం

కల్లూరు జనవరులశాఖ సర్కిల్ మధిర బ్రాంచి కాల్వ ద్వారా పలు మేజర్ క్వాలలకు సాగునీటిసరఫరా విషయంలో సంబంధిత శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. ఈ యాసంగి సాగులో ఉన్న పంటలకు గాను ప్రభుత్వం వారబంది పద్ధతిపై సాగర్ కాల్వ ద్వారా సాగునీరు అందిస్తుంది. గత జనవరి నెల 8వ తేదీ నుంచి ఇప్పటి వరకు మూడు దశలుగా వారబందిని అమలు చేశారు. అయితే నీటి పంపిణీలో మాత్రం అధికారులు క్షేత్ర స్థాయి పర్యవేక్షణ చేయక పోవవటం, మరోవైపున ఎస్ఈ స్థాయి నుంచి ఈఈ, డీఈల మధ్య సమన్వయం లేక పోవటంతో మధిర బ్రాంచి కాల్వ పరిధిలో గల పలు మేజర్లకు వారబందిపై సక్రమంగా సాగునీటి సరఫరా కావటం లేదని తెలిసింది. అందుకు నిదర్శనంగా ఎస్ఈ కార్యాలయంలో సాగునీటి పంపిణీ తీరుపై శుక్రవారం అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. వారబంది అంటే ఏడు రోజుల పాటుగా నిరంతరాయంగా మేజర్లకు సాగునీరు అందించాల్సి ఉండగా కేవలం 5 రోజులు మాత్రమే సాగునీరు సరఫరా చేస్తున్నారని బాధిత రైతులు చెప్తున్నారు. వారంబంది అమలుపై స్పష్టమైన సమాచారం అందించంటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అసలే వరి పైరు పొట్టదశలో ఉందని ఈ దశలో సాగునీరు సక్రమంగా అందకపోతే తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైన జనలవరులశాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి కల్లూరు సర్కిల్‌కు వాటా ప్రకారం రావాల్సిన నీటిని ఎడమకాల్వపై ఎగువ నుంచి విడదల అయ్యేలా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సాగునీటి పంపిణీలో అధికారులు పర్యవేక్షణ చేస్తూ మేజర్ కాల్వలకు సక్రమంగా సాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కల్లూరు సర్కిల్ సాగర్ ఎడమకాల్వ చివరి ప్రాంతానికి చెందిన ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



సాగునీటి పంపిణీలో అధికారుల వివక్ష
కట్టా అజయ్‌కుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు

మధిర బ్రాంచి కెనాల్ పరిధిలో గల పలు మేజర్ కాల్వలకు వారబంది పద్ధతిపై సాగునీరు అందించటంలో అధికారులు వివక్ష చూపతన్నారు. కేవలం ఐదు రోజులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. దీంతో సదరు కాల్వల పరిధిలో వరి పైరుకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మధిర బ్రాంచి కెనాల్‌పై మేజర్ కాల్వలకు సాగునీటి పంపిణీలో లోపం కనిపిస్తుంది.

పుణ్యపురం మేజర్ కాల్వ



ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

» చెరువు శిఖం భూమిని చదును చేసిన వైనం
» భారీ యంత్రాలతో పనులు

పినపాక, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. శిఖం, ప్రభుత్వభూములను చదును చేసి ప్లాట్లుగా చేస్తున్నారు. మండలంలోని సింగిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలోని వెంకటేశ్వరపురం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి పక్కనే ఉన్న సర్వే నెంబర్ 353లోని ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ఆక్రమదారులు తవ్వకాలు చేపట్టారు. భూమిని యంత్రాలతో చదును చేసి, ప్లాట్లుగా మార్చి అమ్మేందుకు సిద్ధమయ్యారు. ఓ వైపు ప్రభుత్వ ధాన్యం గోదాం, సివిల్ సప్లయీస్ బియ్యం గోదాంలకు వెళ్లే మార్గంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్న విషయమై పలు ఆరోపణలు వెల్లువెత్తాయి.



చెరువు కట్టను చదును చేసిన దృశ్యం

అధికారులు పట్టించుకోరనే ధీమాతో అర్ధరాత్రి వేళల్లో భారీ యంత్రాల సాయంతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని, చదును చేశారు. ఆ పక్కనే ఉన్న ఊరి చెరువు శిఖం భూమిని కూడా కలుపుకొన్నారు. చెరువుకట్టనే ధ్వంసం చేసి చదును చేశారు.

ఈ విషయమై అధికారులకు పలు ఫిర్యాదులు వెళ్లడంతో పినపాక తహసీల్దార్ తన సిబ్బందితో దాడులు చేశారు. కాగా అప్పటికే సదరు ఆక్రమదారులు పరారైనట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ భూముల జోలికొస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించినప్పటికీ లెక్కచేయని కబ్జారాయుళ్లు తెగించి ఆక్రమణలకు పాల్పడుతున్నారు. కలెక్టర్, ఆర్డీవో, స్థానిక రెవెన్యూ అధికారులు ఏజెన్సీలోని ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వైద్యసేవలు సక్రమంగా అందించాలి

» డీఎంహెచ్‌వో కళావతిబాయి

కల్లూరు, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి శనివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వహణ సమయంలో సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యసేవలను సక్రమంగా అందించాలని సూచించారు. వైద్యశాఖ చేపడుతున్న అన్ని కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో వంద శాతం అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆసుపత్రి వైద్యాధికారి నవ్యకాంత్, సూపర్‌వైజర్ రామారావు, చార్లెస్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాల్లో పెరుగుతున్న దాహార్తి

రెండు, మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా
జల వనరులున్నా సరఫరా వ్యవస్థలో లోపాలు
భద్రాద్రి జిల్లాలో క్రమంగా పెరుగుతున్న నీటి ఎద్దడి

కొత్తగూడెం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో వేసవికి ముందే తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది. నీటి లభ్యత గణనీయంగా ఉన్నా సరఫరా వ్యవస్థలో లోపాల కారణంగా పట్టణాల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తున్నారు. శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరాను విస్తరించకపోవడంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి నేపథ్యంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి క్రమంగా పెరుగుతోంది.

పైప్‌లైన్ లీకేజీలు నిత్యకృత్యం..

పట్టణాల్లో తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు నిత్యకృత్యమవుతున్నాయి. పైప్‌లైన్లు పాతవి కావడం, వాటి స్థానంలో కొత్త లైన్లు వేయకపోవడంతో మునిసిపాలిటీల్లో ఇదే దుస్థితి నెలకొంది. కొత్తగూడెం, పాల్వంచలో ఒకేరోజులో 50కిపైగా పైప్‌లైన్లలో లీకేజీలను గుర్తిస్తున్న సందర్భాలున్నాయి. కలుషితమైన నీటిని సరఫరా చేస్తుండటంతో అధికశాతం ప్రజలు తాగేందుకు ఆ నీటిని వాడకుండా వాటర్‌ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. ఇదిలా ఉండగా పాల్వంచ మండల పరిధిలోని తొగ్గూడెంలో నిర్మించిన మిషన్ భగీరథ ఇంటెక్‌వాల్ గ్రిడ్ నుంచి ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతిరోజు తాగునీటిని ఎలాంటి అవాంతరాలు లేకుండా సరఫరా చేస్తున్నామని సాయి గ్రిడ్ డీఈఈ తెలిపారు. సత్తుపల్లి 4.50ఎంఎల్‌డీ, ఇల్లెందు 5.90ఎంఎల్‌డీ, కొత్తగూడెం 3ఎంఎల్‌డీ, పాల్వంచ 4ఎంఎల్‌డీతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగూడెం నియోజకవర్గంలో 20ఎంఎల్‌డీ, ఇల్లెందు 30ఎంఎల్‌డీ, అశ్వారావు పేట 28ఎంఎల్‌డీ నీటిని నిత్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు.

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్: తుమ్మల

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజార గిరిజన కుటుంబా ల్లో వెలుగులు నింపి ఆరాధ్యదైవంగా సంత్‌సేవాలాల్ గిరిజనుల గుండెల్లో నిలిచిపోయారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సంత్‌సేవాలాల్ జయంతి కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని దేవాలయానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బంజారాలు మంత్రి తుమ్మలకు పూర్ణకుంభంతో స్వాగత పలికారు. సంత్ సేవాలాల్‌కు మంత్రి తుమ్మల ప్రత్యేకంగా పూజలు నిర్వహించి దేవాలయానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ జగదాంబదేవి ఆశీస్సులతో సంత్‌సేవాలాల్ దేవుడిగా మారారని కీర్తించారు. బంజారాలకు హిందుధర్మం బోధించారని పేర్కొన్నారు. జంతు బలులు, మూఢనమ్మకాల తొలగిపోయేందుకు జగదాంబదేవి ఎదుట తన శిరస్సును ఖండించి తిరిగి జీవించి త్యాగాలు చేసి విశేషంగా కృషి చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో బంజారాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముందుకు సాగారన్నారు. విద్యా, వైద్యం, ఐటీ వంటి రంగాల్లో బంజారాలు రాణిస్తున్నారన్నారు. తెలంగాణ ఏర్పాడిన తర్వాత ప్రతి మండలం, గ్రామంలో సేవాలాల్ జయంతి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా బంజారాలను ఆదుకుంటుందని మంత్రి తుమ్మల తెలిపారు. బంజార సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు జగ్గయ్యానాయక్, దీప్లానాయక్, బాలాజీనాయక్, రాంబాబు నాయక్, రామ్మూర్తినాయక్, మోతిలాల్ నాయక్, ఉపేందర్‌నాయక్, మంగీలాల్ నాయక్ పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన బీసీలకు..

రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఖమ్మం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమస్ఫూర్తితో బీసీ రిజర్వేషన్ల పెంపుకోసం సంఘటిత పోరాటం చేయాలని, ఇందుకు బీసీ సంఘాలన్నీ సమైక్యంగా కదలిరావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. బీసీ జనాభా నిష్పత్తి ప్రకారంగా విద్యా ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లు కలిపించాలన్నారు, ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో శనివారం బీసీ రిజర్వేషన్ల పెంపుపై బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను పెంచేందుకు బీసీ సంఘాలన్నీ కలిసికట్టుగా పోరాటం సాగించాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తూ దశలవారీగా ఆందోళనలు నిర్వహించాలని నిర్ణయించారు. బీసీలకు రాజ్యాంగంలో హుక్కులు పొందుపరిచి ఉంటే భారతదేశం అమెరికాను మించి అభివృద్ధి సాధించేదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీలకు హక్కులు కల్పించకపోవడం వల్లనే వారు రిజర్వేషన్ల ఫలాలు పొందలేకపోయారన్నారు. రాజ్యాంగ రక్షణ లేకపోవడమే బీసీల వెనుకబాటుకు కారణమన్నారు. దేశ అభివృద్ధిలో కులవృత్తులే ప్రధానమని, అలాంటి వృత్తులు బీసీవర్గాల్లోనే ఉన్నాయన్నారు. తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో బీసీ రిజర్వేషన్ల పెంపెనకు పోరాటం సాగించాలని, ఇందుకోసం తెలంగాణ జాగృతి బీసీసంఘాల సమైక్యతకు కృషి చేస్తుందన్నారు. కులగణన సర్వేలో ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు లెక్కలు చూసి బీసీలు మనోవేదనకు గురయ్యారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు లెక్కల ప్రకారం చూసినా రాష్ట్రంలో బీసీలు 46శాతం ఉన్నారన్నారు. రీసర్వేచేయడం ద్వారా మరో 1.5లేదా 2శాతం పెరిగితే బీసీల జనాభా 48శాతం అవుతుందన్నారు. ఇలాంటప్పుడు 42 శాతం రిజర్వేషన్ ఎలా అమలుచేస్తారని ప్రశ్నించారు. బీసీల విద్యా, ఉద్యోగ, రాజకీయరంగాలకు ఒకే బిల్లు పెడితే న్యాయపరంగా చిక్కులు వస్తాయన్నారు. మూడురంగాలకు వేర్వేరుగా బిల్లులు పెట్టి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ముస్లింలతో కలిపి 56శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. ముస్లింలు, బీసీలకు మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం బీజేపీ చేస్తోందని ధ్వజమెత్తారు. గ్రామాలవారీగా ఏకులంలో ఎంత జనాభా ఉందో ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సరైన లెక్కలు లేకపోవడం వల్లనే ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ నివేదికను బహిర్గతం చేయడంలేదన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బీసీలకు ఎంతో మేలు జరిగిందని, అదులో భాగంగా కేసీఆర్ వారికి రాజకీయ, ప్రభుత్వ పదవుల్లో 51శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లకు కోసం తెలంగాణ జాగృతి పోరాటాలవల్లనే అసెంబ్లీలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటైందన్నారు.

సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ తెలంగాణ జాగృతి పక్షాన రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ల పెంపునకు సాగుతున్న పోరాటానికి తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో బీసీ సంఘాలు సంఘటితంగా కార్యచరణలోకి రావాలని సూచించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య, గుండాల కృష్ణ తదితరులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఒక్కరు కూడా బీసీ బీసీ ఎమ్మెల్యే లేకపోవడం బాధాకరమన్నారు. బీసీలకు సీట్లు కేటాయించకపోవడంతో ఎంతో నష్టం జరిగిందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బానోతు హరిప్రియ, మదన్‌లాల్, జడ్పీ మాజీచైర్మన్ లింగాల కమల్ రాజ్, బొమ్మర రామ్మూర్తి, దిండిగాల రాజేందర్, ఉప్పల వెంకటరమణ, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాలకు 46 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ కుల సంఘాల నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రతి 25 సంవత్సరాల కొకసారి ఎదో ఒక ఉద్యమం చేయాల్సిన పరిస్థితి ఉంటుందని అందులో తెలంగాణ ఉద్యమంతో ప్రత్యేక తెంలగాణ సాధించుకున్నామని, ఆ తరువాత ప్రస్తుత ప్రభుత్వం కులగణన పేరుతో నిర్వహించిన సర్వే తప్పుల తడకగా ఉందని అందుకే బీసీ రిజర్వేషన్ల పోరాటానికి మరో ఉద్యమం తప్పదని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. శనివారం నగరంలోని సప్తపది ఫంక్షన్ హాల్లో తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అధ్యక్షతన బీసీ కుల సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు అన్ని బీసీ కులాలకు సంబంధించిన కుల సంఘాల నాయకులు హాజరై కులగణనలో జరిగిన తప్పిదాలను, బీసీల జనాభాను తగ్గించి చూపడాన్ని ఖండిస్తూ మరో మారు కులగణన చేపట్టి అందుకు ముందస్తుగానే ప్రచారం నిర్వహించాలని కోరారు. ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రకృతి సహకారం ఉండటంతోనే నీళ్లు, కరెంట్ సంపూర్ణ అందించగలిగామన్నారు. తెలంగాణలో అన్ని కుల వృత్తులను ఆదుకుని వారిని సమాజంలో గుర్తించిన ఘనత కేసీఆర్‌ది అన్నారు. మున్నూరుకాపు సీనియర్ నాయకులు గుండాల కృష్ణ మాట్లాడుతూ ఖమ్మంలో బీసీ రౌంటేబుల్ సమావేశం నిర్వహించటం అనేది ఆనందంగా ఉందన్నారు. రాజకీయంగా మున్నూరుకాపులను అణిచివేసేందుకు కుట్ర జరుగుతుందన్నారు.

అనంతరం డీసీసీబీ మాజీ చైర్మెన్ కూరాకుల నాగభూషణం, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఎంబీసీ అధ్యక్షురాలు సకీన, కమ్మ, కుమ్మరి, వడ్డెర, ముదిరాజ్, యాదవ, గౌడ, పద్మశాలి, నాయిబ్రాహ్మణ, కురమ,పెరిక, బుడగజంగాల, బెస్త, దూదేకుల తదితర కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ బీసీలకు 46 శాతం రిజర్వేషన్లు అందించాలని, ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మరో బీసీ ఉద్యమం తప్పదన్నారు.

కలగానే 'బైపాస్' ప్రయాణాలు

పట్టణప్రాంతం గుండా భారీ వాహనాల రాకపోకలు
తరచూ జరుగుతున్న ప్రమాదాలు
పెరుగుతున్న మృతుల సంఖ్య

మణుగూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మణుగూరుకు బైసాప్ రోడ్డు ఉండాలి... అలా ఉంటే ప్రమాదాలు జరగవు... ట్రాఫిక్ సమస్యలకు చక్కటి పరిష్కారం లభిస్తుంది అని 15 ఏళ్ల మండల అధికారులు, పోలీసులు పలు రాజకీయ పార్టీల నాయకులు సంయుక్తంగా తీసుకున్న నిర్ణయం.. అయితే నేటికీ అది కార్యచరణకు నోచుకోలేక ఏళ్ల లెక్కిస్తోంది. మణుగూరు పారిశ్రామిక ప్రాంతం అవతరించిన నాటి రోజుల్లో తీసుకున్న నిర్ణయాలు ముందు అడుగు వేయక పోయేసరికి సమస్య ఎక్కడ వేసిన గొంగలి అన్న చందంగా మారింది. ఈ 15 ఏళ్లలో పట్టణ పరిసర ప్రాంతాలు అభివృద్ధిచెందాయి. బీటీపీఎస్ వంటి పరిశ్రమలు ఇక్కడ నెలకొన్నాయి. కేవలం సింగరేణి సంస్థకు చెందిన బొగ్గు ఎగుమతుల లారీలతో పాటు బిటిపిఎస్‌కుచెందిన భారీ వాహనాలు ఎన్నో నిత్యం రాకపోకల్ని సాగిస్తున్నాయి. ఉన్నది ఒక్కటే ప్రధాన రహదారి, ఈ దారి గుండానే వందల సంఖ్యలో లారీలు, బస్సులు, ఆటోలు ద్విచక్ర వాహనాలు వేల సంఖ్యలో నిత్యం రాకపోకల్ని సాగిస్తున్నాయి. పట్టణ ప్రాంతంలోని తోగ్గూడెం గ్రామ ప్రధాన రహదారి ఆర్అండ్‌బీ రోడ్డు మొదలు హనుమాన్ జంక్షన్, పట్టణ ప్రాంతంలోని ఇదే ప్రధాన రహదారిపై నాటినుంచి నేటి వరకు భారీ వాహనాల రాకపోకల వల్ల ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఎంతో మంది మృత్యువాత పడ్డారు. ద్విచక్ర వాహన దారులు, ఆటో ప్రయాణికులు ఎంతో మంది తమ ప్రాణాలను కోల్పోయ్యారు కానీ నేటికి బైపాస్ రోడ్డు మాట మాత్రం అటక మీద పెట్టిన మూటలా మారింది.

కార్యసాధన సులువే

రక్త సిక్తం అవుతున్న ప్రధాన రహదారిపై ఇక రక్తం జాడలు చెడిపివేయాలంటే ఖచ్చితంగా మణుగూరుకు బైపాస్ రోడ్డు విషయంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పదేళ్లలో రోడ్డు ప్రమాదాల్లోచనిపోయిన వారి సంఖ్య దాదాపు వందకు పైనే ఉంటుంది. మరో మారు డివిజన్ పోలీసు ఉన్నతాధికారితో పాటు మణుగూరు ఏరియా సింగరేణి జీఎం స్థాయి అధికారులు, బీటీపీఎస్ సీఈలతో పాటు సమావేశాన్ని నిర్వహించి మణుగూరు బైపాస్ రోడ్డుకు మరోమారు అంకురార్పణ చేసి కార్యచరణ స్థాయికి తీసుకురావాల్సి అవసరం నేటి రోజుల్లో ఎంతైనా ఉంది. పట్టన వాసులు కూడా ఈ విషయంపై ముక్త కంఠంతో ఈ డిమాండ్ వినిపిస్తున్నారు.

రైల్వే స్టేషన్ మీదుగా తరలించాలి

సింగరేణి బొగ్గు పరిశ్రమతో పాటు, బీటీపీఎస్‌కు వచ్చే వందలాది లారీలను రూట్ మార్చి నడిపించాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో బైపాస్ రోడ్డును తోగ్గూడెం రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా ఓల్డ్ సీఎస్‌పి గుండా ప్రధాన రహదారి కలుపుతూ ఉంటే బాగుంటుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. బైపాస్ ఇలా చేసినట్లైతే లారీల జరిగే ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. పట్టణ ప్రాంతంలో ప్రబలే కాలుష్యాన్ని కూడా కాస్త తగ్గుముఖం పడుతుంది. ద్విచక్ర వాహన దారులకు ఇతర వాహానాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అలాగే పట్టణ ప్రాంతంలో పోలీసులు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే ద్విచక్ర వాశానాల ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉందని పట్టణ వాసులు సూస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై అధికారులు స్పందిస్తే ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

జమలాపురం శ్రీవారికి ముత్యాల కవచాలంకారం

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కలిపించారు. ఆలయ అర్చకుడు ఉప్పల రాజీవ్‌శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని తమ నూతన వాహనాలతో గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. మాఘ శనివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీక్కువగా ఉంది.

ఆలయానికి అన్నదాన సత్రాన్ని నిర్మించిన దాత లక్కిరెడ్డి జయప్రకాష్‌రెడ్డి, అన్నపూర్ణదంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆశీరవచనం చేసి శ్రీవారి శేష వస్త్రాలను బహుకరించారు

సేవా సమితి నిర్వాహకులు అన్నగోవిందంలో భాగంగా భక్తులకు ఉచితంగా అన్నవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ దర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ ఇరకులపాటి కృష్ణప్రసాద్, వెంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో సీఎండీని కలిసిన టీఆర్‌వీకేఎస్ నాయకులు

పాల్వంచ,ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో సీఎండీ వరుణ్‌రెడ్డిని టీఆర్‌వీకేఎస్ (హెచ్-58) కార్మిక సంఘం నాయకులు శనివారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రాన్స్‌కో వ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆయనకు వినతి పత్రం సమర్పించారు. అందులో ప్రధానంగా ఈపీఎఫ్ టూ జీపీఎఫ్ సమస్య దీర్ఘకాలికంగా పరిష్కారానికి నోచుకోలేదని, ఆర్టిజన్స్ కన్వర్షన్, గ్రేడ్‌చేంజ్ వంటి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోడూరి ప్రకాష్, రాష్ట్ర అధ్యక్షుడు కేవీ. జాన్సన్, రాష్ట్రప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, కంపెనీ కార్యదర్శి కరెంట్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవేందర్‌రెడ్డి,రాష్ట్రఉపాధ్యక్షుడు నరేందర్‌పాల్, నాయకులు అజీజ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు

స్కోచ్ సమ్మిట్ అవార్డు

సంస్థ ఎండీ లక్ష్మికి అందించిన చైర్మన్ రాయల


అవార్డును అందిస్తున్న చైర్మన్ రాయల

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన 100వ స్కోచ్‌సమ్మిట్ 2024 అవార్డును రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కైవసం చేసుకొంది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో స్కోచ్ సమ్మిట్ నిర్వాహకులు అవార్డును రాష్ట్ర గిడ్డంగుల సంస్థచైర్మన్ రాయల నాగేశ్వరరావు చేతుల మీదుగా గిడ్డంగుల సంస్థ ఎండీ కోర్రా లక్ష్మికి అందించారు. డిజిటల్ లావాదేవిలతో పాటుగా సమర్థంగా ఆర్థికలావాదేవీలు చేపట్టినందుకు అవార్డును అందుకోవటం జరిగిందని చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. గిడ్డంగుల సంస్థలో పనిచేసే అధికారులు, ఉద్యోగులకు అభినందనలు ప్రకటించారు. ఉద్యోగుల సమష్టి కృషితో ఇది సాధ్యమైందన్నారు.

మహిళల చేతికే కుళాయిల నిర్వహణ

- ఇప్పటికే కేఎంసీలో ఆరు ట్యాంకుల బాధ్యతలు అప్పగింత
- నీటిపంపులు ఆన్‌లైన్ రిపేరు, ఆదాయ వసూళ్ల బాధ్యతలు
- ఖమ్మంలో ఆదర్శంగా సాగుతున్న అమృతమిత్రాలు


చేతి పంపు కోసం తవ్వకాలు చేస్తున్న మహిళలు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): నీటివిలువ మహిళలకు తెలిసినంతకు మరేవ్వరికీ తెలియదంటారు పెద్దలు. ఇక తాగునీటి సంగతి చెప్పాల్సిన అవసరం లేదు. అయితే ప్రభుత్వం 'నీటికోసంమహిళ.. మహిళకోసంనీరు' అనేనినాదంతో రాష్ట్రంలోని 8 నగర పాలక సంస్థలతో పాటుగా ఖమ్మం నగర పాలక సంస్థలో అమృత్ మిత్రాలకు అనుమతి ఇచ్చింది. నెలరోజులుగా ఖమ్మం నగరంలోని తాగునీటి నిర్వాహణ బాధ్యతలను దశల వారీగా వారికే అప్పగించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక చొరవతో ఇటు మహిళా సంఘాలకు ఉపాధితో పాటుగా కేఎంసీకి ఆర్థిక రాబడిగా అమృత్‌మిత్రాలు ఆర్థిక మిత్రాలుగా మారారు. కాగా రాష్ట్రప్రభుత్వం శుక్రవారం హైదరాబాద్‌లో కేఎంసీలోని ఇంజనీరింగ్ అధికారి కృష్ణలాల్, మెప్మా టీఎంసీ సుజాతలకు శిక్షణ ఇచ్చారు. ప్రత్యేకంగా రూ.60 లక్షల నిధులను అమృత మిత్రా పథకాలకు కేటాయించారు. దీంతో అమృత మిత్రాలకు మెప్మా పరిధిలోనే చెల్లింపులు జరగనున్నాయి.

ఆరు మహిళా సంఘాలకు ఉపాధి

ఖమ్మంలో మొత్తం 18వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వాటిలో గుట్టల బజార్, ఖైకొండాయిగూడెం, బాలపేట, రోటరీనగర్, శ్రీరామ్‌హిల్స్, ఎస్‌పీ ఆఫీస్ రోడ్డు వాటర్ ట్యాంకులు ప్రధానమైనవి.. వీటి నిర్వాహణ బాధ్యతలను ఉప్పలమ్మ తల్లి, లిల్లీ, ఉషశ్రీ, తిరుమల, ప్రియదర్శిని, ముద్దమందారం మహిళా స్వయం సహాయక సంఘాలకు కేటాయించారు. ఒక్కో ట్యాంకుకు ఒక్కోమహిళా స్వయం సహాయక సంఘాన్ని కేటాయించారు. దీంతో ఆరు మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి దక్కింది.

మహిళల చేతికే బాధ్యతలు

ఖమ్మం నగరంలోని తాగునీటి పంపిణీ బాధ్యతలు ఇక దశల వారీగా మహిళా స్వయం సహాయక సంఘాల చేతికే చేరుతున్నాయి. ఇప్పటికే అమృత్ పథకంలో నివాసాలకు తాగునీటి పంపులను ఏర్పాటు చేశారు. కానీ వాటినుంచి ట్యాక్స్ వసూళ్లు జరగటం లేదు. నెలరోజులుగా ఖమ్మం నగర పాలక సంస్థలో అమృత్‌మిత్రాలే తాగునీటి పంపుల నూతన కనెక్షన్‌లు ఆన్ లైన్ నమోదు నుంచి మంజూరు, నిర్మాణం, ట్యాక్స్ వసూళ్లు, మరమత్తులు, నూతన కనెక్షన్‌లు మంజూరు వరకు పనులు చేపట్టనున్నారు. భవిష్యత్‌లో ఏ ప్రాంతం తాగునీటి ట్యాంకులను అదే ప్రాంతంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించే నిర్ణయాలు జరుగుతున్నాయి.

> తాగు నీటి పథకాల మరమత్తుకు కేఎంసీపై ఆధార పడకుండా అమృత మిత్రాలకు రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించింది. ఒక్కో మరమత్తుకు రూ.1400 ఇవ్వనున్నారు. ఆర్థిక ఇబ్బందులు రాకుండా ఒక్కో తాగు
>
> **అమృత మిత్రాలకు రూ.60 లక్షల నిధులు**
>
> నీటి ట్యాంకు రూ.10లక్షల చొప్పున ఆరు ట్యాంకులకు రూ.60 లక్షల నిధులు కేటాయించారు. ప్రతీ సంఘానికి నెలకు 25నుంచి 30మరమత్తుల పనులతో మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి కార్యచరణ చేశారు. మెప్మా తరుపు నుంచే అమృత్ మిత్రాలకు చెల్లింపులు జరిగేలా కార్యచరణ చేశారు.

ఆర్థిక మిత్రులుగా అమృత మిత్రాలు

ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 5లక్షల వరకు జనాభా పెరిగింది. 1లక్ష 10వేల వరకు నివాసాలు ఉన్నాయి. వీటిలో 78వేల నివాసాలకు అమృత్ పథకంలో తాగునీటి పంపు కనెక్షన్‌లు ఏర్పాటు చేశారు. కానీ 36వేల కనెక్షన్‌లను మాత్రమే ఆన్‌లైన్ నమోదు చేశారు. మిగిలిన కనెక్షన్‌లకు తాగు నీరు పంపిణీ జరుగుతున్నా కేఎంసీకి ట్యాక్స్ కలెక్షన్ రావటం లేదు. దీంతో కేఎంసీ కమిషనర్ ప్రత్యేక చొరవ తీసుకొని తాగునీటి కనెక్షన్‌లు ఉండి ఆన్‌లైన్ జరగని పంపులపై మెప్మా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. అమృత్ మిత్రాలతో ఆయా కనెక్షన్‌లను ఆన్‌లైన్ నమోదు చేయిస్తున్నారు. ఒక్కో పంపు ఆన్‌లైన్‌కు అమృత్ మిత్రాలకు రూ.100 ప్రోత్సహకం అందుతుండగా కేఎంసీకి తాగునీటి కనెక్షన్‌ల ద్వారా ఆదాయం దండిగా పెరుగుతుంది.

సమాజ గతిని మార్చేది విజ్ఞానమే

- డీఈవో వెంకటేశ్వరచారి
- 'తొలిఅడుగు' ఆధ్వర్యంలో కొత్తగూడెంలో సైన్స్‌ఎక్స్‌పో


బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సామాజ గతిని మార్చేది విజ్ఞానమేని, బాల్యం నుంచే శాస్త్రం పట్ల అవగాహనతో భావిశాస్త్రవేత్తలుగా తయారు కావడానికి వీలు కలుగుతుందని డీఈవో వెంకటేశ్వరచారి, సైంటిస్ట్ సత్యానారాయణ పాటిల్ అన్నారు. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నతపాఠశాలలో తొలి అడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ ఎక్స్‌పో జరిగింది. ఈ కార్యక్రమాన్ని డీఈవో, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, సింగరేణి విద్యాశాఖ కరస్పాండెంట్ సునీల్ ప్రారంభించారు. ప్రధానంగా వ్యవసాయం-ఆహారం, హెల్త్ మేనేజ్‌మెంట్, సైన్స్ అండ్‌టెక్నాలజీ, పర్యావరణ అంశాలపై జరిగిన ప్రదర్శనలో జిల్లానలుమూలల నుంచి 189ప్రాజెక్ట్‌లు వచ్చాయి. విద్యార్థులు భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా తయారు అయ్యేందుకు తొలిఅడుగు ఎంతో ఉపయోగపడుతుందని ఫౌండర్ బి.రాము అన్నారు. న్యాయ నిర్ణేతలుగా శాస్త్రవేత్తలు సత్యనారాయణ పాటిల్, ఎస్.పండరీనాద్, జె.ఫణి కాంత్, జి. రవి, సిహెచ్. ప్రదీప్‌కుమార్, పి.భాస్కర్, మధుసూధన్, జిల్లాఎఫ్ఎస్‌సీ ఎఎస్. శ్రీనివాస్, బి. సంపత్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం ఎ.సాయి సునీత, పి.శివ, బి.సౌజన్య, నాగలక్ష్మి, స్వాతి, నాగమణి, అనూషా, గోపాల్, వనజీవి మొక్కల వెంకటయ్య, తదితరులు వ్యవహరించారు. వనజీవి వెంకటయ్య ఆధ్వర్యంలో మెడిసినల్ ప్లాంట్స్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

విజేతలు వీరే..

వ్యవసాయంలో వరణ్‌కుమార్, సింగరేణి స్కూల్ ఇల్లెందుకు ప్రథమ బహుమతి లభించింది. సైన్స్‌అండ్‌టెక్నాలజీలో బి.సంతోష్ కుమార్ సింగరేణి స్కూల్ ఇల్లెందుకు, ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో టి. కార్తిక్ ఏహెచ్ఎస్ గుండాలకు ప్రథమ, పర్యావరణంలో ఇంతియాజ్ కొత్తగూడెం పాఠశాలకు ప్రథమ బహుమతి లభించింది.విజేతలు ఒక్కోక్కరికి నాలుగు వేలు నగదు బహుమతిని అందజేశారు. ఆయా విభాగాల్లో ద్వితీయ, తృతీయ బహుమతులు లభించాయి.

దశాబ్ధాల నిరీక్షణకు తెర

- డీఎస్సీ-2008 అభ్యర్థులకు పోస్టింగ్‌లు
- భద్రాద్రి జిల్లాలో 44మంది, ఖమ్మంలో 45 మందికి ..
- కాంట్రాక్టు విధానంలో నియామకం


నియామకపత్రంపై సంతకం చేస్తున్న డీఎస్సీ- 2008 అభ్యర్థి

కొత్తగూడెంఅర్బన్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ-2008 బాధితుల నిరీక్షణ ఫలించింది. ఎట్టకేలకు విద్యాశాఖ శుక్రవారం పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో దశాబ్ధాల ఎదురు చూపులకు తెరపడింది. ఈమేరకు శనివారం డీఈఓ కార్యాలయంలో 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. వీరిని కాంట్రాక్ట్ విధానంలో సెకండరీ టీచర్లుగా(ఎస్‌జీటీ)గా నియమించారు. రూ. 34,040 కన్సాలిడేటెడ్ వేతనం అందుకోనున్నారు. ఉమ్మడి ఏపీలో చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయంతో మంచి మార్కు లు సాధించి, మెరిట్ జాబితాలో ఉన్నా.. బీఈడీ అభ్యర్థులు ఉద్యోగాలకు దూరం అయ్యారు. నష్టపోయిన వారంతా న్యాయపోరాటానికి దిగారు. ఈక్రమంలో వీరిని కాంట్రాక్ట్ విధానంలో మినిమం టైంస్కేల్ వర్తింపజేస్తూ పాఠశాల విద్యాశాఖ నియామకం చేపట్టింది. ఈసందర్భంగా డీఈవో వెంకటేశ్వరచారి మాట్లాడుతూ.. ఎంపికైన ఉపాధ్యాయులు కాంట్రాక్ట్ పద్ధతిన ఎంపిక అయ్యామని కాకుండా పూర్తిస్థాయిలో అంకితభావంతో విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం జిల్లాలో ప్లెయిన్‌ఏరియాలో 28మంది, ఏజెన్సీ ఏరియాలో 18 మందికి నియామక పత్రాలు అందజేశారు. సోమవారం మండల విద్యాధికారులకు రూ.100 బాండ్‌పేపర్‌పై ఒప్పంద సంతకం చేసి విధుల్లో చేరాలన్నారు.

ఖమ్మం జిల్లాకు 45 మంది

ఖమ్మంఖానాపురంహవేలి: ఖమ్మం జిల్లాలో 45 మందికి విద్యాశాఖ కేటాయించింది. వీరిలో ముగ్గురు 2024 డీఎస్సీలో ఉద్యోగం సాధించారు. మిగిలిన 42మందికి శనివారం నగరంలో డైట్ కళాశాలలో నిర్వహించిన కౌన్సిలింగ్ నిర్వహించారు. 35మంది హాజరుకాగా వారికి కౌన్సిలింగ్ అనంతరం కాంట్రాక్ట్ విధానంలో ఎంపికైనట్లు ధ్రువపత్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ అందించారు.

సమ్మక్క సారలమ్మ ఆలయంలో చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమలకుంట కాలనీ సమీపంలో గల సమ్మక్క సారలమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న పట్టు చీరెలు, అమ్మవారి అలంకరణకు సంబంధించిన ఆభరణాలను చోరీ చేశారు. ఉదయం ఆలయ అర్చకులు ఆలయానికి రాగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. చోరీ విలువ దాదాపు రూ.70 వేల వరకు ఉంటుందని ఆలయ అర్చకులు, కమిటీ చైర్మన్ వగ్గెల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆలయ కమిటీ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు వివరాల సేకరించి ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ దొంగ అరెస్టు

11తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీనగర్ గ్రామ పంచాయతీ సాయినగర్ కాలనీలో ఉపాధ్యాయురాలు చిలక పద్మావతి ఇంట్లో ఈనెల 8వతేదీన చోరీ జరిగింది. మరోసటి రోజు 9వ తేదీన ఆ ఉపాధ్యాయురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారం రోజుల్లో దొంగతనాన్ని చేధించి శనివారం దొంగను పట్టుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చోరీ వివరాలు వెల్లడించారు. లక్ష్మీదేవిపల్లి మండలం సాయినగర్ కాలనీకి చెందిన చిలక పద్మావతి మహిళ టీచర్ రోజు మాదిరిగా 8వతేదీన కారుకొండ పాఠశాల వెళ్లింది. కాగా సాయంత్రం వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం పగులకొట్టి ఉండటాన్ని గమనించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలో ఉన్న సుమారు 11 తులాల బంగారం, వెండి పట్టీలు కనిపించలేదు. చోరీ జరిగినట్లుగా గమనించి పోలీసులకు సమాచారం అందించింది. ఈ మేరకు లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ రమణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నేరం జరిగిన ప్రాంతంలో డాగ్‌స్క్వాడ్ తనిఖీతోపాటు క్లూస్ టీంలు పరిశీలించి వేలిముద్రలను సేకరించి దొంగను పట్టుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

ఈ క్రమంలో శనివారం ఎస్ఐ ఇల్లెందు క్రాస్ రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఓ వ్యక్తి రావడంతో అతడిని ఆపి తనిఖీ చేయగా అతని వద్ద బంగారం ఉండటాన్ని గమనించారు. అతడిని పట్టుకుని విచారించగా నేరం రుజువైంది. ఆ వ్యక్తి పాల్వంచలోని వనమా కాలనీకి చెందిన ధరంసోత్ మాన్‌సింగ్‌గా గుర్తించారు. గోదావరి ఖనిలో 6, పాల్వంచలో 13, ఎన్‌టీపీసీ గోదావరిఖని-1 మొత్తం 20 దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. మాన్‌సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడ్డాయని, దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ప్రజలు అమర్చుకోవాలని కోరారు. సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రమణారెడ్డి, సీసీఎస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌ను ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌కు అప్పగింత

చింతకాని, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల నాగులవంచ పెట్రోల్ బంక్‌లో జరిగిన దాడి ఘటనలో నిందుతుడిగా ఉన్న ఆర్మీ జవాన్ బూదాల మనోజ్‌ను చింతకాని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని హైదరాబాద్ ఆర్మీ హెడ్ క్వార్టర్స్‌లో అప్పగించినట్లు వైరా ఏసీపీ రహమాన్ తెలిపారు. బూదాల మనోజ్ ఆర్మీ విధులకు వెళ్లకుండా గైర్హాజరు అవుతూ తప్పించుకుని తిరుగుతున్న నేపథ్యంలో ఆర్మీ అధికారులు డిజెక్టర్ ఉత్తర్వులు, అతడిని పట్టుకునేందుకు వారెంట్ జారీ చేశారు. గతంలో కూడా విధులకు వెళ్లకుండా తప్పించుకుని పారిపోయి వచ్చాడని ఇతనిపై ఓ యువతిని వేధించిన కేసుతో పాటు భార్యను వేధింపులకు గురి చేసిన పలు క్రిమినల్ కేసుల్లో నిందుతుడిగా ఉన్నాడని తెలిపారు. ఆర్మీ జవాన్ ఉద్దేశ్యపూర్వకంగా సామాజిక మాధ్యమాలలో స్థానిక పోలీసులపై అసత్య ఆరోపణలు చేస్తూ పోలీసుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం సరికాదన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని ఏసీపీ తెలిపారు.

అర్హత కలిగిన ప్రతి మహిళను సభ్యురాలిగా చేర్చాలి

- పెళ్లి కాని మహిళలు ఎస్‌హెచ్‌జీ సంఘాలకు అర్హులే
- మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మహేందర్


మాట్లాడుతున్న మహేందర్

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): 18ఏళ్ల వయస్సు వచ్చి పెళ్లి కాని మహిళలను మహిళా స్వయం సహాయక సంఘాల్లో చేర్చుకునేందుకు మెప్మా నుంచి తాజాగా అనుమతి వచ్చిందని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ప్రాజెక్టు డైరెక్టర్ మహేందర్ పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో టీఎంసీ గుడిపూడి సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్పీల సమావేశంలో పీడీ మహేందర్ మాట్లాడారు.

ఖమ్మం జిల్లాలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రూ.165 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను మహిళా సంఘాలకు ఇవ్వడం జరిగిందని వాటిలో ఖమ్మం నగరంలోనే రూ.103 కోట్లు ఇచ్చామని ఆయన వివరించారు. చైతన్యవంతమైన ఖమ్మం జిల్లాలో రికవరీల కూడా మంచిగా జరుగుతున్నాయని ఆర్పీలను అభినందించారు. ఇటీవల కాలంలో స్త్రీనిధి రుణాలను ఆర్పీలు, సీవోలు రికవరీ చేశారని అభినందించారు. మెప్మా ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన అంశాలను ఆర్పీలు, సీవోలకు వివరించారు.

గతంలో వివాహం జరిగిన మహిళలను మాత్రమే సంఘంలో సభ్యులుగా అవకాశం ఉండేదని, తాజా సర్క్యులర్ మేరకు 18 ఏళ్ల నిండిన యువతులను సభ్యులుగా చేర్చుకోవాలని వివరించారు. ఇందిరా మహిళా శక్తి పథకం, కొత్త సంఘాల ఏర్పాటు లక్ష్యం, స్త్రీనిధి చెల్లింపులపై సమీక్షించారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు ఆర్పీలు సీవోలు బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఆర్పీ పరిధిలో 30 నుంచి 35 సంఘాలు ఉండేలా నిర్మాణం చేయాలన్నారు. ఎవ్వరి పరిధిలో ఉన్న సంఘాలను వారే ఏర్పాటు చేసుకోవడం ద్వారా సంఘాలపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. రేషన్‌కార్డు ప్రమాణికంగా ఇంటింటి సర్వే చేపట్టి సంఘాలను ఏర్పాటు చేయలన్నారు. ఈ మేరకు సర్వే నిర్వహించి నూతన సభ్యులను ఎస్‌హెచ్‌జీల్లో చేర్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారిత కోసం కావాల్సిన మేరకు ఆర్థిక రుణసహాయం అందిస్తుందని తెలిపారు. డీఎంసీలు సుజాత, సీవోలు సల్మా, ఉపేంద్ర, ద్రౌపతి, రోజా తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కాంగ్రెస్ నేత ఘన్‌శ్యామ్ లాహోటి మృతి



ఇల్లెందు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్త, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఘన్ శ్యామ్ లోహోటి(84) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురైన లాహోటి హైదరాబాద్‌లో వైద్య చికిత్సలు పొందుతూ మరణించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రముఖ కాంగ్రెస్ నాయకుడిగా పార్టీకి సేవలు అందించారు. దివంగత మాజీ ముఖ్య మంత్రి జలగం వెంగళరావు దివంగత మాజీ మంత్రి శీలం సిద్దరెడ్డి తదితరులకు అత్యంత సన్నిహితంగా మెలిగారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, మండల రాము, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ డాక్టర్ రవి, బీజేపీ నాయకులు కొల్లి సంజీవ రెడ్డి, సోమ సుందర్, మావునూరి మాధవ్, సీపీఎం నేత అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సంతాప సూచకంగా పలు వ్యాపార సంస్థలు మూసి వేశారు.

ఇరువర్గాల ఘర్షణ: 11 మందిపై కేసు

జూలూరుపాడు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): భూవివాదం నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగి పరస్పర దాడులు చేసుకున్న సంఘటనలో 11 మందిపై జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన చెకిలాల సందీప్, భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పూనెం సూరయ్యల మధ్య గత కొంత కాలంగా భూవివాదం నెలకొంది. ఈ క్రమంలో రామకృష్ణాపురం గ్రామంలో ఈ నెల 11వ తేదీన ఇరు వర్గాల మధ్య మరోసారి భూవివాదం విషయంలో ఘర్షణ తలెత్తింది. దీంతో వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూరయ్య ఫిర్యాదు మేరకు సందీప్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, సందీప్ ఫిర్యాదు మేరకు సూరయ్యతో పాటు మరి కొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావడంతో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ విచారణ నిర్వహిస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం




బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న కాంగ్రెస్ నాయకులు (ఇన్‌సెట్‌లో దగ్ధమవుతున్న ఇల్లు)

పినపాక, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన పినపాక మండలంలోని సీతంపేట గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. సీతంపేట గ్రామానికి చెందిన పూస వెంకటేష్‌కు చెందిన ఇంటిలో విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూ ట్ కావడంతో ఇళ్లు కాలి బూడిదైంది. కాగా ఫైరింజన్ సకాలంలో రావడంతో మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. తహసీల్దార్ అద్దంకి నరేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, పంచనామా చేశారు. రూ.10లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. వెంకటేష్ కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించి, నిత్యావసరాలు, ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో ఆరె నవీన్‌కుమార్, బండారు సాంబశివరావు, కొండేరు కృష్ణమూర్తి, సందీప్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో....

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెదనల్లబల్లిలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో కణితి నాగమణి, అనిరెడ్డి వెంకన్న, భూక్యా లక్ష్మణ్‌ల ఇళ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. నాగమణి ఇంట్లో రూ.50వేల నగదు, తులం బంగారం, అరతులం వెండి, వెంకన్న ఇంట్లో రూ.10వేల నగదు, అరతులం బంగారం, అరతులం వెండితోపాటు మూడిళ్లలోనూ గృహోపకరణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. తొలుత నాగమణి ఇంటికి నిప్పంటుకోగా, పక్కన ఉన్న రెండు ఇళ్లకు మంటలు వ్యాపించాయి. స్థానిక యువకులు నిప్పును ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అగ్నిమాపక యంత్రం మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. అగ్నిబాధిత కుటుంబాలకు తక్షణసాయం కింద విజయవాడ పీవీ చారిటబుల్ ట్రస్టు రూ.10వేల నగదును మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమాచినేని వినీల్ చేతుల మీదుగా అందజేశారు. ఉపాధ్యక్షుడు తెల్లం హరికృష్ణ, కనుబుద్ది దేవా, మాజీ సర్పంచ్ మట్టా శివాజీ, సిద్ది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పాల్వంచ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని దంతెలబోరకు చెందిన జిలుగు సునీల్‌కుమార్(22) స్థానికంగా ప్రైవేటు జాబ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అతని స్నేహితులు కొత్త సతీష్, కొత్త గోవింద్‌లు దంతెలబోర వచ్చారు. కొంత సేపు వారితో గడిపిన తరువాత సునీల్ వారిరువురినీ పాల్వంచలో దించడానికి తన ద్విచక్ర వాహనంపై బయలుదురాడు. మార్గమధ్యలో నారాయణరావుపేట వద్ద పాల్వంచ నుంచి దంతెలబోర వెళుతున్న ట్రాక్టర్ అతి వేగంగా వారు ముగ్గురూ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో సునీల్ తీవ్రంగా గాయపడగా, మిగిలిన ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికులు వారిని పాల్వంచ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సునీల్ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి జిలుగు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ హెచ్‌సీ కృష్ణ తెలిపారు.

మహదేవపురంలో అక్రమంగా ఇసుక రవాణా

మధిర రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మధిర మండలం మహదేవపురం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి తరువాత వైరా ఏటి నుంచి ఇసుకను అక్రమంగా తరలించి ఓ చోట డంప్ చేశారని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఎస్సీ కాలని వద్ద వాటర్ ట్యాంకు పక్కన గల ఖాళీ స్థలంలో పది ట్రక్కుల ఇసుకను నిల్వ చేశారు. శనివారం ఉదయం గ్రామస్థులు చూసి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఇసుకను తరలిస్తున్న వారిపై చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మధిరటౌన్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన మధిరలోని శాంతి థియేటర్ వద్ద శనివారం రాత్రి జరిగింది. మధిర నుంచి వైరా వైపు వెళ్లే రోడ్డు నుంచి సందరయ్యనగర్ ఆరవ లైనులో తన ఇంటికి వెళ్లేందుకు శ్రీనివాస్ అనే వ్యక్తి యూటర్న్ తీసుకునే క్రమంలో వెనక నుచి బైక్ పై వస్తున్న ముగ్గురి యువకులు అతడి బైక్‌ను ఢీ కొనడంతో నలుగురు గాయపడ్డారు. బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు అశోక్, గౌస్‌పాషా, రోహన్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో అశోక్, రోహన్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తరలించారు.



డాబా పైనుంచి పడి మహిళ దుర్మరణం

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు డాబాపై నుంచి పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన శనివారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సారధీనగర్‌కు చెందిన కొండూరు శ్రీనివాస్ నాగమణి దంపతులు ఇస్త్రీచేసుకుంటూ జీవనంసాగిస్తున్నారు. శనివారం సాయంత్రం సమయంలో నాగమణి డాబాపైన ఊడిచేందుకు వెళ్లింది. కళ్లుతిరిగి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందింది. ఈ ఘటనపై భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	24
గుత్తి వంకాయ	30
బీరకాయ	48
పచ్చిమిర్చి	24
బెండకాయ	38
బెండకాయ	44
పొట్లకాయ	38
దోసకాయ	38-40
చిక్కుడు	44
నాటుచిక్కుడు	80
గోరుచిక్కుడు	44
క్యాబేజీ	20
దొండ	24-30
సొరకాయ	18
క్యారెట్	24
క్యాప్సికం	54
ఆలుగడ్డ	28
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	10

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

ఘనంగా సంత్‌సేవాలాల్ జయంతి

ఖమ్మంక్రైం, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు రవిరాథోడ్ ఆధ్వర్యంలో సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి బీజేపీ జిల్లాపార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ శ్రీనివాస్‌రెడ్డి సేవాలాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నున్న రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, జాటోత్ మోహన్, భట్టు రమేష్, దనియాకుల వెంకటనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంచర్చికాంపౌండ్: బంజారాల ఆరాధ్యుడు,శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శ్యాంకుమార్, డాక్టర్ నారాయణమూర్తి, బానోతు బద్రునాయక్, భూక్యా ఉపేంద్రాబాయి, షేక్ నజీమా,జ్యోతి, సంధ్య, స్పందన, ప్రమీల,త్రివేణి పాల్గొన్నారు.



వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో..

బంజారాలను గుర్తించింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- ఎమ్మెల్సీ కవిత
- సేవాలాల్‌జయంతి వేడుకలకు హాజరు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): బంజారాలను గుర్తించి, తండాలను పంచాయతీలుగా మార్చింది బీఆర్ఎస్ అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఖమ్మం పర్యటనలో భాగంగా శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. గిరిజన మహిళలతో కలిసి బీఆర్ఎస్ కార్యాలయంలోకి వచ్చారు. అనంతరం సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించింది బీఆర్ఎస్ ప్రభుత్వమని ఆమనత కేసీఆర్‌దన్నారు. పేరుకు ముగ్గురుమంత్రులున్నా పనికిమాత్రం సున్నా అని అన్నారు.



మాట్లాడుతున్న కవిత

ములాఖత్‌లో సేరేందర్‌కు పరామర్శ

ఖమ్మంబైపాస్‌రోడ్: ప్రభుత్వ పనితీరును ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కేసులుపెడుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్‌ను పరామర్శించేందుకు శనివారం ఆమె జిల్లా జైలువద్దకు వచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీతాతా మధు, మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యేలు బానోతు హరిప్రియ, బానోతు మదన్‌లాల్, బొమ్మెరరామ్మూర్తిలతో కలిసి పరామర్శించి తమ సంఘీబావం తెలిపారు.

కవితను సత్కరించిన నాయకులు

ఖమ్మంబైపాస్‌రోడ్: ఖమ్మం పర్యటనలో భాగంగా ఖమ్మం వచ్చిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ప్రముఖులు సత్కరించారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ జిల్లానాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు కార్యాలయంలో ఆమెకు మొక్కను బహూకరించి శాలువాతో సత్కరించారు.

వేగంగా ట్రామాకేర్ భవన నిర్మాణం

రూ.25కోట్లతో కొనసాగుతున్న పనులు

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): జిల్లాజనరల్ ఆస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న ట్రామాకేర్ భవన నిర్మాణం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం కార్డియాలజీ భవనానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో దీని నిర్మాణాన్ని టీఎస్ఎంఐడీసీ అధికారులు చేపట్టారు. రూ.25 కోట్లతో భవనానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. గ్రౌండ్‌ఫ్లోర్‌తో కలిపి మూడు ఫ్లోర్లతో నిర్మించే ఈ భవనంలో పై అంతస్థులు మూడుఆపరేషన్ థియేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 75పడకలు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఐసీయూ వార్డు, క్యాజువాలిటిని ఏర్పాటు చేస్తున్నారు. భవన నిర్మాణానికి రూ.14కోట్లు, ఆపరేషన్ థియేటర్ సామగ్రి, ఇతర సామగ్రికి రూ.10కోట్లను వెచ్చించనున్నారు. మూడుఅంతస్థుల భవనానికి రెండు ప్రత్యేక లిఫ్టులు కూడా ఏర్పాటు చేస్తున్నారు.



జిల్లా ఆస్పత్రిలో నూతనంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం

కొవిడ్ మహమ్మారి వ్యాధులు సంక్రమించినా ఈ భవనంలో రోగులను ఉంచి చికిత్సలు అందించేలా ప్రత్యేకంగా డిజైన్ చేశారు. అయితే ఇంత పెద్దభవనానికి మూడు అంతస్థులకు ర్యాంపు లేకపోవడం గమనార్హం.లిఫ్ట్ పనిచేయక పోయినా, ఇతర సాంకేతిక లోపాలతో పనిచేయక పోతే ర్యాంపు ద్వారా నడిచే అవకాశం ఉంది. భవనానికి ర్యాంపు సౌకర్యం లేకుంటే భవిష్యత్తులో క్రిటికల్ అవుతుందని భావిస్తున్నారు.

ఎట్టకేలకు కనకదుర్గ కాలనీకి రోడ్డు



రోడ్డు సౌకర్యం లేని నాటి ఫోటో (ఫైల్), తాత్కాలికంగా రోడ్డును నిర్మించిన దృశ్యం

ఖమ్మంమార్కెట్, ఫిబ్రవరి15 ఆంధ్రజ్యోతి): నగరంలోని 51వ డివిజన్ నూతన బస్టాండ్ వద్ద గల కనకదుర్గ కాలనీకి అధికారులు ఎట్టకేలకు రోడ్డును అందుబాటులోకి తీసుకొచ్చారు. జనవరి 31న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన 'కలగానే కనకదుర్గ కాలనీ రోడ్డు' అనే శీర్శికకు అధికారులు స్పందించారు. వెంటనే రోడ్డు నిర్మాణం ఆవశ్యకం ఉన్న ప్రదేశాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ సందర్శించారు. రోడ్డు నిర్మాణంపై ఆరా తీశారు. వెంటనే రోడ్డు ఆవశ్యకతపై మంత్రి తుమ్మలకు వివరించి రోడ్డు నిర్మాణం జరిగేందుకు కృషి చేశారు. కాగా ప్రస్తుతం సదరు రోడ్డును తాత్కాలికంగా రాకపోకలు సాగించే విధంగా నిర్మించారు. అనంతరం ఆయా రోడ్డుకు పూర్తి స్థాయి నిధులతో అడ్డుగా ఉన్న పెద్ద బండరాయిని తొలగించి నూతనంగా పక్కా రోడ్డును నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా తక్షణమే రోడ్డును నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన మంత్రి తుమ్మలకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహారాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు



పూజిత, భవాని

ఖమ్మంస్పోర్ట్స్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఈనెల 15నుంచి 18వరకు హర్యానాలో జరగనున్న 71వసీనియర్ మహిళల జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన సిలివేరు పూజిత, కొండా భవాని ఎంపికైనారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు ఎంపికైనారు. పూజిత ఖమ్మం రూరల్ మండలం రామన్నపేట కాలనీకి చెందిన క్రీడాకారిణి కాగా, పూజిత కూసుమంచి మండలం పోచారం గ్రామానికి చెందిన క్రీడాకారిణి... వారు జాతీయ స్థాయిపోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున ప్రాతినిధ్యం వహించనున్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు తుంబూరు దయాకర్‌రెడ్డి, క్రిష్టఫర్‌బాబు, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి అభినందించారు. జాతీయపోటీల్లో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

18న కబడ్డీ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 18న నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో సబ్‌జూనియర్ బాలురు, బాలికల విభాగంలో కబడ్డీ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో వికారాబాద్ జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 01-04-2009 తరువాత జన్మించిన వారు, బాలురు, బాలికలు 55కేజీల లోపు బరువు ఉండాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 9గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

ఉచిత కంటి పరీక్షలు విజయవంతం

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దతండాలోన ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం పెద్దతండాలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కంట పరీక్షలు చేస ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు, ప్రిన్సిపల్ డాక్టర్. బి.గోపాల్, డైరెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు

ఖమ్మంఖానాపురంహవేలి,ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): కులగణన ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లు పెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో జిల్లా కమిటీ, మండల కార్యదర్శులు సమావేశంలో మాట్లాడారు. చట్టం చేయటం వలన బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కొరకు కొన్ని పార్టీలు కులగణను వ్యతిరేకిస్తున్నాయని పోతినేని అన్నారు. రాజ్యాంగం ప్రకారం జనాభా లెక్కలు కులగణన చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కమిటి సభ్యులు ఎర్ర శ్రీకాంత్, సభ్యులు భారతి, వెంకటేశ్వరరావు, రమేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని

మల్లెమడుగు రైల్వేగేటు మూసివేత

ఖమ్మంమామిళ్లగూడెం, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం- పాపటపల్లి మధ్య నిర్వహిస్తున్న రైల్వేలైన్ మూడోలైన్ పనులు కొనసాగుతున్నాయి.ఈనేపథ్యంలో ఖమ్మం-మల్లెమడుగు స్టేషన్ మధ్యలో ఉన్న రామన్నపేట రైల్వేగేట్‌ను ఈనెల 18 నుంచి మార్చి 9వ తేదీ వరకు 20రోజుల పాటు గేట్‌ను మూసివేస్తున్నారు. ఈవివరాలు ఖమ్మం స్టేషన్ మేనేజర్ పీఎస్వీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి ప్రచారం

ఖమ్మం,ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి)ప్రతినిధి): ఖమ్మం,నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు పూర్తికావడంతో ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న టీ జేఏసీ బలపరుస్తున్న గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఖమ్మం ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ఎఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల, శాంతినగర్ కళాశాలలో మధ్యాహ్న భోజన సమయంలో ప్రచారం సాగించారు. ఉపాధ్యాయులను తనను గెలిపించాలని కోరారు. తనను గెలిపించడం ద్వారా ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు తీసుకెళ్లి వచ్చే దసరానాటికి సమస్యలన్ని పరిష్కారం చేపిస్తామన్నారు.

కొనసాగుతున్న కిష్టారం గ్రామస్థుల దీక్ష

- అనారోగ్యంతో ఆసుపత్రికి చేరిన ముగ్గురు మహిళలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): పలు అనారోగ్య కారణాలతో కిష్టారానికి చెందిన ముగ్గురు మహిళలు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు శనివారం 108 ద్వారా చేరుకున్నారు. ఇద్దరు ఆసుపత్రిలోనే చికిత్స పొందుతుండగా మరోకరు డిశ్చార్జ్ అయిన సంఘటన శనివారం సత్తుపల్లి మండలంలో చోటు చేసు కుంది. కిష్టారం గ్రామంలో 6రోజులుగా నిరవధిక రిలే దీక్షలు చేపడుతున్న క్రమంలో శిబిరంలో పాల్గొన్న పానెం పుల్లమ్మ ఉన్నట్టుండి స్పృహ తప్పి పడిపోయింది. మారోజు శ్రీదేవితో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న కామాల రాణి 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నా రు. శ్రీదేవి కిడ్నీవ్యాధి, లంగ్స్ ఇన్‌ఫెక్షన్‌తో పుల్లమ్మ, బ్లడ్ తక్కువతో పాటు ఇన్‌ఫెక్షన్ కారణంగా రాణీలు బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు. బాధితుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూసైలోబంకర్ నుంచి వెలువడే కాలుష్యం కారణంగా శారీరక, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, పిల్లలు కూడా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని వాపోయారు.



శ్రీదేవిని పరీక్షిస్తున్న వైద్యులు

నీలాద్రిలోశివరాత్రి జాతర ఏర్పాట్లపై సమీక్ష

పెనుబల్లి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా నీలాద్రీశ్వర ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ అన్నారు. శనివారం నీలాద్రీశ్వర ఆలయ ప్రాంగణంలో ఏసీపీ రఘుతో కలిసి పలుశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఆయాశాఖల అధికారులతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం మహాశివరాత్రి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఈవో వెంకటరమణ, ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ సుధీర్, చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావు పాల్గొన్నారు.

గీతాంజలిలో ఘనంగా స్పోర్ట్స్‌డే



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గీతాంజలి విద్యానికేతన్ పాఠశాలలో శనివారం స్పోర్ట్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ టివి అప్పారావు, డైరెక్టర్లు టి పద్మ, అరుణ్ హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలల్లో క్రీడల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

మాజీ మంత్రి పువ్వాడను కలిసిన కమ్మ సంఘం కమిటీ

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ మహాజన సంఘం కమిటీ సభ్యులు శనివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను మర్యాదదపూర్వకంగా కలిశారు. సమాజ అభివృద్ధిలో కమ్మ సంఘం కీలకంగా ఉండాలని, ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా సంఘం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా పని చేసి భవిష్యత్తు తరాలకు మార్గదర్శంగా ఉండాలని సూచించారు. అనంతరం సీపీఎం జాతీయ నాయకుడు తమ్మినేని వీరభద్రం, సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావును కలిశారు.

యూరియాను తగిన మోతాదులో వినియోగించుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య

బోనకల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంలో యూరియాను అవసరం మేరకు సిఫారుసు చేసిన మోతాదులో మాత్ర మే వాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ధ నసరి పుల్లయ్య రైతులకు సూచించారు. మండలంలోని ఆళ్లపాడు రెవెన్యూ పరిధిలో సాగు చేసిన మక్క పంటలను శనివారం ఆయన పరిశీలించారు. నీటిఎద్దడి కారణంగా ఎండిపోయిన పంటలు ఏమి లేవని స్పష్టం చేశారు. పంటలకు తడులు అందించుకునే విషయంలో ఎగువ భూముల రైతులు ఎక్కువగా నీరు వాడుకుంటున్న క్రమంలో చివర భూముల రైతులకు కొంత మేరకు ఇబ్బంది కలుగుతుందన్న విషయాన్ని కొందరు జేడీఏ దృష్టికి తీసుకెళ్లారు. వారబందీ విదానంలో నీటి విడుదలతో పాటు అదనంగా మరో నాలుగు రోజుల పాటు నీటిని సరఫరా చేయాలని రైతులు కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఏవో పసునూరి వినయ్ కుమార్, ఏఈవోలు బందం రజిత, ఆత్మ కమిటీ డైరెక్టర్లు కందుల పాపారావు, షేక్ దస్తగిరి పాల్గొన్నారు.





ఆంధ్రజ్యోతి
ZONE
ఆదివారం 16 ఫిబ్రవరి 2025
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి



హైదరాబాద్‌లో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



పెనుబల్లిలో సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు



బోనకల్‌లో...

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

సత్తుపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు శనివారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులోని శ్రీ మెట్టాంజనేయ స్వామి ఆలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మధిరటౌన్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలను శనివారం మధిరలోని బంజారా కాలనీ లో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి బంజార జాతికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు బాబ్లా నాయక్, బాణోత్ రమణ నాయక్, ధీరావత్ మాధవి, కోట్యా నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగా హనుమంతరావు తదితరులున్నారు.

కారేపల్లి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి వేడుకలను శనివారం మండల వ్యాప్తంగా పలుప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

వైరా, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బంజారాభవన్‌లో జరిగిన సంతు సేవాలాల్ జయంతి వేడుకల్లో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. సంతు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులతోపాటు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

బోనకల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బోనకల్ రైతు వేదిక కార్యాలయంలో శనివారం గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను తహసీల్దార్ అనిశెట్టి పున్నమ్ చందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్. రమాదేవి, ఎంఈవో దామాల పుల్లయ్య, గిర్దావర్ జి. లక్ష్మణ్, గిరిజన సంఘ నాయకులు బీవీ నాయక్, బాణోతు కొండ, గుగులోతు నాగేశ్వరరావు, గుగులోతు పంతు, గుగులోతు రుప్లా, రమేష్ నాయక్, గుగులోతు రామకృష్ణ, సైదా, జరపల శివకృష్ణ పాల్గొన్నారు.

ముదిగొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంతు సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి తహసీల్దార్ సునీతా ఎలిజిబెత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ అనంతరాములు, డిప్యూటీ తహసీల్దార్ ఉసికల ఉపేందర్, ఆర్ఐ వహీదా సుల్తాన్ పాల్గొన్నారు.

చింతకాని, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వందనం గ్రామంలో శనివారం సంతు సేవాలాల్ 286వ జన్మదిన వేడుకలను నిర్వహించారు. తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, డీటీ వీరభద్రూనాయక్, ఆర్ఐలు రఘు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, లకావత్ నాగులు, లకావత్ రమేష్, లకావత్ శ్రీను, సీతారాములు, సోమయ్య పాల్గొన్నారు.



సత్తుపల్లిలో నృత్యాలు చేస్తున్న మహిళలు

పెనుబల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సంతు సేవాలాల్ జయంతి వేడుకలను పెనుబల్లి మండలంలోని వీఎంబంజర్, గంగదేవిపాడుల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతు సేవాలాల్ చిత్రపటానికి కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్, ఖమ్మం డీఎంహెచ్‌వో కళావతిబాయి, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ బాగం నీరజప్రభాకర్, వైస్‌చైర్మన్ కోటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, సీతరామారావు, బాపిరెడ్డి, కరీముల్లా, పసుమర్తి విశ్వనాథ్, మంగునాయక్, ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ గుర్రం సుధీర్, నాయకులు పాల్గొన్నారు.



మధిరటౌన్‌లో..



కారేపల్లిలో...



ముదిగొండలో...

జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుత్తాకు పితృవియోగం

▸ నివాళులర్పించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఏన్కూరు, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నారం గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మంత్రి తుమ్మల ముఖ్య అనుచరుడు గుత్తా వెంకటేశ్వరరావు తండ్రి అనంత రామయ్య (90) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు శనివారం జన్నారంలో అనంతరామయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, ఖమ్మం కార్పొరేటర్ కమర్తపుమురళి, ముళ్లపాటి సీతారాములు, కట్టా కృష్ణార్జునరావు, స్వర్ణనరేంద్రకుమార్ తదితరులున్నారు.



రామయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లిలో ...

సత్తుపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం సత్తుపల్లి పట్టణంలో పర్యటించారు. జలగం నగర్‌లోని ఎర్రా జవహర్‌లాల్, భట్టి విక్రమార్కలను పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నాయకుడు డాక్టర్ కూసంపూడి నరసింహారావు నివాసానికి వెళ్లి ఆయనతో మాట్లాడారు.

అదేవిధంగా హెచ్ఎం బజ్జూరి వెంకటేశ్వరరావు, సుజాతలక్ష్మీ, బొంతు రవిచంద్ర ఇంట వివాహం జరగ్గా నూతన వధూవరులను వేర్వేరుగా ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, చలసాని సాంబశివరావు, చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా తదితరులున్నారు.

యూరియాను తగిన మోతాదులో వినియోగించుకోవాలి

▸ జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య

బోనకల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఎరువుల వినియోగంలో యూరియాను అవసరం మేరకు సిఫారుసు చేసిన మోతాదులో మాత్రమే వాడుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య రైతులకు సూచించారు. మండలంలోని ఆళ్లపాడు రెవెన్యూ పరిధిలో సాగు చేసిన మక్క పంటలను శనివారం ఆయన పరిశీలించారు. నీటి ఎద్దడి కారణంగా ఎండిపోయిన పంటలు ఏమి లేవని స్పష్టం చేశారు. పంటలకు తడులు అందించుకునే విషయంలో ఎగువ భూముల రైతులు ఎక్కువగా నీరు వాడుకుంటున్న క్రమంలో చివర భూముల రైతులకు కొంత మేరకు ఇబ్బంది కలుగుతుందన్న విషయాన్ని కొందరు జేడీఏ దృష్టికి తీసుకెళ్లారు. వారబందీ విధానంలో నీటి విడుదలతో పాటు అదనంగా మరో నాలుగు రోజుల పాటు నీటిని సరఫరా చేయాలని రైతులు కోరగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఏవో పసునూరి వినయ్ కుమార్, ఏఈవోలు బందం రజిత, ఆత్మ కమిటీ డైరెక్టర్లు కందుల పాపారావు, షేక్ దస్తగిరి తదితరులున్నారు.



పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

బోనకల్ మండలానికి ముగ్గురు 2008 డీఎస్సీ టీచర్లు

బోనకల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): 2008 డీఎస్సీ ద్వారా బోనకల్ మండలంలో మూడు టీచర్ పోస్టులను కేటాయించారు. జిల్లాలో శనివారం విద్యాశాఖాధికారులు ముగ్గురు ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులను ఇచ్చారు. మండలంలోని కలకోట(హరిజనవాడ) ప్రాథమిక పాఠశాలకు సీహెచ్. అంజనేయులు, గోవిందాపురం(ఎల్) ఎస్సీకు సీహెచ్. అనిత, మోటమర్రి పీఎస్‌కు అబ్బూరి రాజవేణులు ఎస్జీటీలుగా పని చేయనున్నారు. వీరికి ఎంఈవో దామాల పుల్లయ్య, పీఆర్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. రామ్మోహన్, ఎం. వెంకటేశ్వరరావు, కొమ్ము శ్రీనివాసరావు, రవి కుమార్, ఝాన్సీ, శారద, వెంకటేశ్వరరావు, కొండలరావులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



న్యాయమూర్తి శాంతిలతను అభినందిస్తున్న బార్ సభ్యులు

మధిరటౌన్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మధిర కోర్టు తాత్కాలిక న్యాయమూర్తిగా శ్రీమతి శాంతిలత శనివారం కోర్టులో ప్రస్తుత న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి శిక్షణ నిమిత్తం వెళుతుండగా ఖమ్మం ఎక్సైజ్ జడ్జిగా పనిచేస్తున్న శాంతిలతకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తిని మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు, న్యాయవాదులు చావలి రామరాజు, కట్టా పూర్ణచందర్‌రావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, దిరిశాల జగన్మోహన్‌రావు అభినందనలు తెలియజేశారు.

'ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి'

కొణిజర్ల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటర్ వర్కర్స్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే లాల్‌మియా అన్నారు. శనివారం మండల పరిధిలోని తీగల బంజర గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర రవాణాశాఖమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 14నెలలు అయిందని, చేసిన వాగ్దానాలు అమలు చేయకుండా గత ప్రభుత్వ దారిలోనే నడుస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాలు, లెనిన్, భాషా, చంద్రియ, మంగ్య, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరణ

కారేపల్లి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో కారేపల్లి రైల్వేస్టేషన్‌లో రద్దు చేసిన రిజర్వేషన్ కౌంటర్‌ను రైల్వే అధికారులు ఎట్టకేలకు పునరుద్ధరించారు. ఖమ్మం జిల్లాలో ఏకైక రైల్వే జంక్షన్ అయిన కారేపల్లి రైల్వే స్టేషన్‌లో కౌంటర్ లేకపోవడం వలన గత నాలుగేళ్ల నుంచి ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనితో ఈరైల్వే లైన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నా ఆరైళ్ళకు రిజర్వేషన్ కావాలన్నా తత్కాల్ టికెట్లు కావాలన్నా ఈప్రాంతప్రయాణికులు ఖమ్మం, కొత్తగూడెం లేదా డోర్నకల్ రైల్వే స్టేసన్లకు వెళ్లి రిజర్వేషన్ చేయించుకుని తిరిగివచ్చి కారేపల్లిలో రైలు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది. ఈవిషయంపై రైల్వే అధికారులకు పలుమార్లు మొరపెట్టుకోగా ఎట్టకేలకు రైల్వే అధికారులు శనివారం నుంచి రిజర్వేషన్ కౌంటర్‌ను పునరుద్ధరించారు. రైల్వే అధికారులను, ప్రజాప్రతినిధులకు సామాజిక కార్యకర్త ఇందుర్తి సురేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ రైల్వే లైన్‌లో రద్దు చేసిన మిగతా రైళ్లను కూడా పునరుద్ధరించాలని కోరారు.

ముగిసిన 'పది' అంతర్గత మూల్యాంకనం

కల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో విద్యాశాఖ తరపున గత మూడు రోజులుగా చేపట్టిన పదో తరగతి విద్యార్థుల అంతర్గత మూల్యాంకన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ ఏడాది మార్చి నెలలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరగు విద్యార్థుల అంతర్గత మార్కుల, రికార్డుల పరిశీలన చేపట్టారు. మండలంలో మొత్తం 19 ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రగతిని గత మూడు రోజులుగా రెండు ఉపాధ్యాయ బృందాలు సందర్శించి పరిశీలించారు. ఈ బృందంలో హెచ్ఎంలు వై.రమణయ్య, పవన్‌కుమార్, ఉపాధ్యాయులు మౌలాలి, నిర్మలజ్యోతి, గాంధీనాయక్, ఎస్.మధు తదితరులున్నారు.



విద్యార్థుల రికార్డులను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

పశువైద్య శిబిరం

కల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని ఎర్రబంజర గ్రామంలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పశువైద్యాధికారి కె మమత ప్రారంభించారు. ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, నట్టల నివారణ మందు త్రాగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటి అధ్యక్షుడు అత్తునూరి సత్యనారాయణరెడ్డి, గోపాలమిత్ర సూపర్‌వైజర్ టీ వెంకటేశ్వర్లు గోపాలమిత్రలు బి. వెంకటేశ్వర్లు, కె. అప్పారావు, కృష్ణప్రసాద్, రవికుమార్, హనుమంతరావు తదితర రైతులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఏన్కూరు, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా చేగుంట మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీ కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని శనివారం సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు కృష్ణప్రసాద్, మెసెంజర్స్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి రుద్రగిరి సిబ్బంది హరిత, లత, సుమన్, శివాజి పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో విద్యార్థుల ప్రతిభ

కొణిజర్ల, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్ ఫలితాలలో స్థానిక మైనారిటీ గురుకుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. శనివారం ప్రతిభ కనబరిచిన ద్వితీయ సంవత్సరానికి చెందిన జానీపాషా, ప్రణయ్‌కుమార్‌లను ప్రిన్సిపాల్ జితేష్‌కుమార్ అభినందించారు. విద్యార్థులను అభినందించిన వారిలో లెక్చరర్‌లు రాధిక, త్రివేణి, ప్రభాకర్, పీడీ రవికుమార్, పీఈటీ సాయి పాల్గొన్నారు.

విద్యార్థులు నైతిక విలువలను అలవర్చుకోవాలి

▸ 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్



న్యాయాధికారులు, డీఐఈఓలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థులు సక్రమమార్గంలో పెరుగుతారని 6వ అదనపు జిల్లా జడ్జీ మారగాని శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జీ ఎస్కే.మీరాఖాసీం, డీఐఈఓ రవిబాబులు అన్నారు. శనివారం సత్తుపల్లిలోని శ్రీ నారాయణ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈనాటి విద్యావిధానంలో అనేకమార్పులు రావాలని, మార్కులతో పాటు విద్యార్థులకు మంచి సంస్కారం నేర్చుకోవాలన్నారు. ఒత్తిడులను అధిగమించి కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించడం ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను కళాశాల యాజమాన్యం నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య, డైరెక్టర్ వనమారెడ్డి మధుసూదన్‌రెడ్డిలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ రాజాకృష్ణ, కృష్ణారెడ్డి, అధ్యాపకులు నవకుమార్, మోహన్‌రావు, నాగరాజు, పుల్లారావు, నరేందర్‌లు పాల్గొన్నారు.

టీయూసీఐ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

కల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఈ నెల 21న ఖమ్మంలో జరగనున్న హమాలి సంఘం జిల్లా మహాసభ పోస్టర్లను శనివారం ఆ సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ మహాసభకు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని సభను విజయవంతం చేయాలని టీయూసీఐ నాయకులు జె మాల్యాద్రి, కే. పుల్లారావులు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గోపి, కృష్ణ, అశోక్, వెంకటి రాంబాబు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లూర్దుమాత మహోత్సవాలు

తల్లాడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నారాయణపురంలోని లూర్దుమాత చర్చి మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఖమ్మం పీఠాధిపతి డాక్టర్ ఎస్.ప్రకాష్ పాల్గొని సమిష్టి దివ్యబలిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో విచారణ గురువులు అజయ్‌జోసఫ్, ప్రాన్సీస్, మరియన్న తదితరులు పాల్గొన్నారు.



దివ్యబలిపూజలో పాల్గొన్న బిషప్, విచారణ గురువులు

పెంట్యాల పుల్లయ్యను పలకరించిన కవిత



కవితతో పెంట్యాల పుల్లయ్య

చింతకాని, ఫిబ్రవరి 15: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను కల్వకుంట్ల కవిత అప్యాయంగా పలకరించారు. ఖమ్మం పర్యటనకు వచ్చిన కవితను ఆయన జిల్లా పార్టీ కార్యాయంలో కలిశారు. పుల్లయ్య అక్రమ అరెస్టు గురించి మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆమెకు వివరించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని తప్పకుండా పార్టీ గుర్తిస్తుందని వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని సంధర్బంగా తెలిపారు. త్వరలో పొద్దుటూరు గ్రామం వస్తానని హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న కిష్టారం గ్రామస్థుల దీక్ష

▸ అనారోగ్యంతో ఆస్పత్రికి చేరిన ముగ్గురు మహిళలు



శ్రీదేవిని పరీక్షిస్తున్న వైద్యులు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పలు అనారోగ్య కారణాలతో కిష్టారానికి చెందిన ముగ్గురు మహిళలు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు శనివారం 108ద్వారా చేరుకున్నారు. ఇద్దరు ఆసుపత్రిలోనే చికిత్స పొందుతుండగా మరోకరు డిశ్చార్జ్ అయిన సంఘటన శనివారం సత్తుపల్లి మండలంలో చోటు చేసు కుంది. కిష్టారం గ్రామంలో 6రోజులుగా నిరవధిక రిలే దీక్షలు చేపడుతున్న క్రమంలో శిబిరంలో పాల్గొన్న పానెం పుల్లమ్మ ఉన్నట్టుండి స్పృహతప్పి పడిపోయింది. మారోజు శ్రీదేవితో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న కామాల రాణిబ్రీజీ 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. శ్రీదేవి కిడ్నీ వ్యాధి, లంగ్స్ ఇన్‌ఫెక్షన్‌తో పుల్లమ్మ, బ్లడ్ తక్కువతో పాటు ఇన్‌ఫెక్షన్ కారణంగా రాణీలు బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు. ఈ సందర్భంగా బాధితుల కుటుంబ సభ్యులు మాట్లాడు తూ సైలోబంకర్ నుంచి వెలువడే కాలుష్యం కారణంగా శారీరక, ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, పిల్లలు కూడా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని వాపోయారు.

కులాంతర వివాహం

చింతకాని, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో ముదిరాజ్ పెద్దలు శనివారం కులాంతర వివాహం నిర్వహించారు. గ్రామానికి చెందిన లింగం రవి, అత్తులూరి తేజశ్రీ ప్రేమించుకున్నారు. వీరిరువురిది వేరు వేరు కులాలు కావడంతో ఇరు కుటుంబాలు ప్రేమను అంగీకరించకపోవడంతో గ్రామ పెద్దలు ఇరువురి తల్లిదండ్రులను ఒప్పించి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో కుటుంబీకుల సమక్షంలో వివాహం నిర్వహించారు. కార్యక్రమంలో లింగం రాంబాబు, లింగం వెంకటేశ్వర్లు, అత్తులూరి రామనరసయ్య, సింగారపు వీరభద్రం, మేకల సత్యనారాయణ, ప్రసాదరావు, ఈర్ల బ్రహ్మయ్య, బండ్ల రామయ్య పాల్గొన్నారు.



వధూవరులతో గ్రామస్థులు

నీలాద్రిలోశివరాత్రి జాతర ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్


పెనుబల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా నీలాద్రీశ్వర ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ అన్నారు. శనివారం నీలాద్రీశ్వర ఆలయ ప్రాంగణంలో ఏసీపీ రఘుతో కలిసి పలుశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఆయాశాఖల అధికారులు సిబ్బందితో ఏర్పాట్లు చేయాలని సూచిం,చారు. అనంతరం మహాశివరాత్రి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఈవో వెంకటరమణ, ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ సుధీర్, చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావు పాల్గొన్నారు.

సాంకేతికతతోనే ఉపాధి అవకాశాలు

▸ జేవీఆర్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ నండ్రు గోపి

సత్తుపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక నైపుణ్యాలతోనే భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చునని జేవీఆర్ ప్రభుత్వ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నండ్రు గోపి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఐబీఎం కంపెనీ శిక్షణకులు నవీన్‌చే శనివారం కళాశాలలో విద్యార్థులకు భవిష్యత్ ఉద్యోగాలు, విద్యాభ్యాసంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. విద్య యొక్క ప్రాధాన్యత, ఎంచుకోవాల్సిన రంగాలు, సాంకేతిక నైపుణ్యాలు, నూతన పరిశ్రమల ఆవశ్యకతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రదర్శన



జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో రమాదేవి

బోనకల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని 22 గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాలల్లో శనివారం పోలింగ్ స్టేషన్ల జాబితాలను నోటీస్ బోర్డుల పై ప్రదర్శించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబందించి 67 పోలింగ్ స్టేషన్ల వివరాలను ఎంపీడీవో ఆర్. రమాదేవి వెల్లడించారు. మండలంలో మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. బోనకల్, ముష్టికుంట్ల, చిరునోముల, ఆళ్లపాడు, కలకోట, బ్రాహ్మణపల్లి, మోటమర్రి, పెద్దబీరవల్లి, రావినూతల, నారాయణపురం, గార్లపాడు, లక్ష్మీపురం, తూటికుంట్ల ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల వివరాలను ప్రజలకు తెలియ పరిచేలా ప్రదర్శించారు.

ఎన్‌సీసీ జాతీయ చైర్మన్‌గా శామ్యూల్

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ జాతీయ చైర్మన్‌గా హోప్ మినిస్ట్రీస్ డైరెక్టర్ శామ్యూల్ జాషువా గెడ్డం నియమిస్తూ శనివారం వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్‌పాల్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ నగర్ క్రీస్తుసంఘంలో ఆయనను సంఘబాధ్యులు, పాస్టర్లు శనివారం ఘనంగా సన్మానించారు. ఈయన ఎన్నికపట్ల ఎమ్మెల్యే మట్టా రాగమయి, జాతీయ, రాష్ట్ర, జిల్లా బాధ్యులు స్టీఫెన్ చిట్టిబాబు, సిల్వియా జయదేవ్, బిషప్ సంజయ్ ఆనంద్, డా.జార్జ్‌ముల్లర్, జీఎస్.దేవసహాయం, గుర్రాల సత్యానందం, అలవాల కరుణాకర్, జయదీప్ ముఖర్జి నంబూరి, నిర్మలాదేవి బూరుగులు తదితరులు అభినందనలు తెలిపారు.

విద్యుత్‌శాఖ పొలం బాట కార్యక్రమం

కల్లూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని తెలగవరం గ్రామంలో శనివారం విద్యుత్‌శాఖ వారు పోలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దకోరుకొండి విద్యుత్‌శాఖ సబ్‌ఇంజనీర్ రామిరెడ్డి రైతులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో హరీష్, రైతులు పాల్గొన్నారు.